# ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రిక



## రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.
ఉదయం
సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 4 | సంచిక: 133 | పేజీలు: 6 | వెల: రూ.3/- | శనివారం 22 ఆగస్టు 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


# చివరి నిమిషంలో రేవంత్ అమెరికా టూర్ రద్దు

- సీఎం రేవంత్ అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరణ
- 23న లండన్ నుంచి హైదరాబాద్ చేరుకోనున్న సీఎం
- వచ్చే నెలలో అమెరికా వెళ్లే యోచన
- అమెరికా భేటీలకు అధికారులను పంపే అవకాశం
- 'తెలంగాణ రైజింగ్' ఆగదని సీఎం స్పష్టీకరణ



**న్యూఢిల్లీ, ఆగస్టు 21 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన చివరి నిమిషంలో రద్దయింది. అమెరికాలో నిర్వహించాల్సిన 'తెలంగాణ రైజింగ్' సమావేశాలకు కేంద్ర విదేశాంగ శాఖ అనుమతి ఇవ్వకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. దీంతో బ్రిటన్ పర్యటన ముగించుకొని సీఎం ఈ నెల 23న లండన్ నుంచి నేరుగా హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. తెలంగాణకు భారీ పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి లండన్, అమెరికాలో 'తెలంగాణ రైజింగ్' పేరుతో సమావేశాలు నిర్వహిం చేందుకు ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా అమెరికాలోని బోస్టన్, న్యూయార్క్‌లో సీఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ముఖ్యమంత్రి కార్యాలయం షెడ్యూల్ కూడా సిద్ధం చేసింది. అయితే చివరి నిమిషంలో కేంద్ర విదేశాంగ శాఖ నుంచి ..మిగతా 2లో

**కాంగ్రెస్ పార్టీ కాదు**

# నా టార్గెట్ రేవంత్

## కొండా సుస్మిత సంచలన వ్యాఖ్యలు



- సోనియా, రాహుల్, ప్రియాంకపై గౌరవం ఉందన్న సుస్మిత
- రేవంత్, ఆయన కుటుంబం అవినీతికి పాల్పడుతోందని ఆరోపణ
- 'టికెట్ నిర్ణయించడానికి సీఎం ఎవరు?' అని ప్రశ్న
- స్వతంత్రంగా పోటీ చేసేందుకు సిద్ధమని ప్రకటన
- పరకాల నుంచి పోటీ చేయడం ఖాయమని వెల్లడి

**హైదరాబాద్, ఆగస్టు 21 (ప్రభాత ఉదయం)**

మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. కుమార్తె వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ సురేఖ పదవికి రాజీనామా చేయాలని ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్నారు. ఈ తరుణంలో కొండా సుస్మిత మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను కేవలం సీఎం రేవంత్ రెడ్డిని మాత్రమే లక్ష్యంగా చేసుకొని ఆ వ్యాఖ్యలు చేశానని స్పష్టం చేశారు.

"సీఎం రేవంత్ రెడ్డి పరకాల వచ్చి రేవూరి ప్రకాశ్ రెడ్డికి ఎమ్మెల్యే సీటు ఇస్తున్నట్లు ప్రకటించారు. నేను రేవంత్ రెడ్డిని మాత్రమే లక్ష్యంగా చేసుకొని వ్యాఖ్యలు చేశాను. పార్టీని కాదు. నాకు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మీనాక్షి నటరాజన్‌పై చాలా గౌరవం ఉంది. కానీ, ..మిగతా 2లో

# చెప్పాల్సింది కమిటీకి చెప్పా

## సీఎం వచ్చాక మాట్లాడతా: కొండా సురేఖ

**హైదరాబాద్, ఆగస్టు 21 (ప్రభాత ఉదయం)**



కాంగ్రెస్ షోకాజ్ నోటీసుల అంశంలో తాను చెప్పాల్సింది క్రమశిక్షణ కమిటీకి చెప్పానని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఈ విషయంపై ఇప్పుడు మీడియాతో మాట్లాడబోనని చెప్పారు. "నేను చెప్పాల్సింది నిన్ననే క్రమశిక్షణ కమిటీకి చెప్పా. ఇప్పుడు కొత్తగా చెప్పాల్సిన విషయాలేమీ లేవు. సీఎం రేవంత్ విదేశీ పర్యటన నుంచి వచ్చాక మాట్లాడతాను"అని కొండా సురేఖ అన్నారు. ఇటీవల వరంగల్ జిల్లా గీసుకొండలో కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో మంత్రికి కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్‌కు వివరణ పంపారు. సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని.. ఈ విషయంలో తనను బాధ్యురాలిని చేయొద్దని అందులో కోరారు. మరోవైపు కొండా సురేఖ కుమార్తె చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కాంగ్రెస్ అధిష్ఠానం కూడా సీరియస్‌గా తీసుకొన్నట్లు సమాచారం. నేరుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మంత్రి కుమార్తె చేసిన విమర్శలు, ఆరోపణలు కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చనీయాంశంగా మారాయి. క్రమశిక్షణా రాహిత్యంగా భావించి నోటీసులివ్వడంతో పరిమితం కాకుండా చర్యలకు కూడా ఉపక్రమించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

### కాక్రోచ్ పార్టీ కార్యకర్తలపై

# గ్రామస్థుల దాడి!

- రాజస్థాన్‌లో స్కూల్ తనిఖీకి వెళ్లిన సీజేపీ
- రాంపురా-కన్వర్‌పురా గ్రామంలో ఉద్రిక్తత
- వాహనాలు, మొబైల్ ఫోన్లు ధ్వంసమైనట్లు సీజేపీ ఆరోపణ
- మహిళా కార్యకర్తలపై కూడా దాడి జరిగిందని వెల్లడి
- ఓ కార్యకర్త చేయి విరిగిందని అశుతోష్ రంకా ఆరోపణ
- నిందితులను అరెస్ట్ చేయాలని సీజేపీ డిమాండ్



**న్యూఢిల్లీ, ఆగస్టు 21 (ప్రభాత ఉదయం)**

రాజస్థాన్‌లో ప్రభుత్వ పాఠశాల పరిస్థితిని పరిశీలించేందుకు వెళ్లిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కార్యకర్తలపై గ్రామస్థులు దాడి చేశారన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఈ ఘటనపై సీజేపీ కో-కన్వీనర్ అశుతోష్ రంకా తీవ్రంగా స్పందించారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేయడంతో పాటు విద్యాశాఖ మంత్రి మదన్ దిలావర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి 48 గంటల గడువు విధించారు. సంగనేర్‌లోని ..మిగతా 2లో


# కొండా సురేఖపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఆగ్రహం

- కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి
- కాంగ్రెస్ ఎమ్మెల్యేల డిమాండ్!
- 15 మంది ఎమ్మెల్యేలు, ఐదుగురు ఎమ్మెల్సీల భేటీ
- సుస్మిత వ్యాఖ్యలపై సమావేశంలో తీవ్ర చర్చ
- వ్యాఖ్యలను సురేఖ ఖండించకపోవడంపై అభ్యంతరం 2



# తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఊరట

- రాయదుర్గం పాన్ మక్తా భూముల వేలంపై జోక్యానికి సుప్రీంకోర్టు నిరాకరణ
- వేలాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం
- గచ్చిబౌలి భూములకు, ఈ భూములకు సంబంధం లేదన్న తెలంగాణ ప్రభుత్వం
- ఏవైనా అభ్యంతరాలుంటే హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచన



**న్యూఢిల్లీ, ఆగస్టు 21 (ప్రభాత ఉదయం)**

తెలంగాణలోని రాయదుర్గం పాన్ మక్తా భూముల వేలం ప్రక్రియలో జోక్యం చేసుకోవడానికి సుప్రీంకోర్టు నిరాకరిం చింది. ఈ వేలాన్ని నిలిపివేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఏవైనా అభ్యంతరాలు ఉంటే హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు స్పష్టం చేసింది. జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) .మిగతా 2లో

**ప్రముఖ నటి షావుకారు జానకి కన్నుమూత**



2

**పోలీస్ స్టేషన్ ముందు రాహుల్ ధర్నా**



# కాంగ్రెస్ పార్టీ కాదు.. నా టార్గెట్ రేవంత్

మొదటి పేజీ తరువాయి...

రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబం అవినీతికి పాల్పడుతోంది. అందుకే వారిని టార్గెట్ చేసుకున్నాను. పైగా ఎమ్మెల్యే టికెట్ ఎవరికివ్వాలో నిర్ణయించడానికి ఆయన ఎవరు? సీడబ్ల్యూసీ సమావేశాల వంటి వ్యవస్థ ఉంది కదా. ఆ ప్రకారంగానే అభ్యర్థులను ప్రకటిస్తారు. నేను అదే ప్రశ్నించాను. నేను స్వతంత్రగా పోటీ చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నాను" అని కొండా సుస్మిత ఓ జాతీయ మీడియా ఛానెల్‌తో మాట్లాడుతూ అన్నారు. వచ్చే ఎన్నికల్లో తాను పరకాల నియోజకవర్గం నుంచి పోటీ చేయడం ఖాయమంటూ




గీసుకొండలో బుధవారం నాడు సుస్మిత అన్న విషయం తెలిసిందే. ఇటీవల పరకాల బహిరంగ సభలో 'వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మంచి మెజార్టీతో గెలిపించాలి' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ అలా ఏకపక్షంగా ఎలా మాట్లాడతారని ప్రశ్నించారు. సీఎం సోదరుడు పెట్టిన డొల్ల కంపెనీకి రూ.200 కోట్ల విలువైన భూమిని కట్టబెట్టారని ఆరోపించారు. తాను ఎవరికీ భయపడనని.. తన వ్యాఖ్యలపై కౌంటర్ ఇప్పించేందుకు ప్రయత్నిస్తే సీఎం కుటుంబం అవినీతిని ఒక్కొక్కటిగా బయటపెడతానన్నారు.

## కొండా సురేఖపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఆగ్రహం

**హైదరాబాద్, ఆగస్టు 21 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ వ్యవహారం రోజురోజుకూ ముదురుతోంది. ఈ అంశంపై ఉమ్మడి వరంగల్, నల్లగొండ జిల్లాలకు చెందిన 15 మంది ఎమ్మెల్యేలు, ఐదుగురు ఎమ్మెల్సీలు సీఎల్పీ వేదికగా సమావేశమై చర్చిం చారు. అనంతరం కొండా సురేఖను రాష్ట్ర మంత్రివర్గం నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేసినట్లు సమాచారం. సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను టార్గెట్ చేస్తూ కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై సమావేశంలో తీవ్ర చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఆమె వ్యాఖ్యలపై పార్టీ అధిష్ఠానం ఇప్పటికే ఆగ్రహంతో ఉన్న నేపథ్యంలో ఎమ్మెల్యేలు కూడా సురేఖకు వ్యతిరేకంగా గళం విప్పారు. సమావేశం అనంతరం ఎమ్మెల్యేలు మీడియా సమావేశంలో మాట్లాడారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలను కొండా సురేఖ ఇప్పటివరకు ఖండించకపోవడాన్ని ఎమ్మెల్యేలు తీవ్రంగా తప్పుబట్టారు. మంత్రి పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలపై బాధ్యత వహించాల్సిందేనని అభిప్రాయపడ్డారు. సీఎంను వ్యతిరేకించే వారికి పార్టీలో ఉండే అర్హత లేదని స్పష్టం చేశారు. మీ భాష ఎప్పుడూ పార్టీకి నష్టం కలిగించేలా ఉందని కొండా ఫ్యామిలీని ఉద్దేశించి అన్నారు. సుస్మిత వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని సురేఖ చెప్పడంపైనా ఎమ్మెల్యేలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇచ్చిన వివరణ తమకు ఆమోదయోగ్యంగా లేదని తేల్చారు. సీఎం రేవంత్ ఎంతో కష్టపడి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారని అన్నారు. అలాంటి వ్యక్తిని విమర్శించినప్పుడు ఖండించడం కనీస బాధ్యత అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీని బలహీనపర్చాలనే ప్రతిపక్షాల కుట్రలకు బలం చేకూర్చుతున్నారని మండిపడ్డారు. అలాంటి వ్యక్తులపై కఠిన చర్చలు తీసుకోవాలని అధిష్ఠానాన్ని కోరారు.

## పోలీస్ స్టేషన్ ముందు రాహుల్ గాంధీ ధర్నా

**పెల్లెట్ గన్ బాధితుడితో కలిసి ఎఫ్ఐఆర్ కోసం డిమాండ్**

**బాధితుడితో పోలీస్ స్టేషన్‌కు రాహుల్ గాంధీ**


**ఎఫ్ఐఆర్ కోసం సీనియర్ పోలీస్ అధికారి కార్యాలయం ముందు ధర్నా**

**జులై 20 నిరసనల్లో పెల్లెట్లు తగిలాయని యువకుడి ఆరోపణ**

**పెల్లెట్ గన్స్ వాడలేదని ఢిల్లీ పోలీసుల వాదన**

**న్యూఢిల్లీ, ఆగస్టు 21 (ప్రభాత ఉదయం)**

పెల్లెట్ గన్ గాయాల వ్యవహారంలో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శుక్రవారం ఢిల్లీలో ఆందోళనకు దిగారు. జులై 20న జరిగిన జెన్-జీ విద్యార్థుల నిరసనల్లో పెల్లెట్ గన్ గాయాలయ్యాయని ఆరోపిస్తున్న సాహిల్ లోచాబ్‌ను వెంటబెట్టుకుని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అనంతరం సీనియర్ పోలీస్ అధికారి కార్యాలయం బయట బాధితుడితో కలిసి ధర్నాకు కూర్చున్నారు. జులై 20న పరీక్షల పేపర్ లీక్‌లకు నిరసనగా వందలాది మంది విద్యార్థులు పార్లమెంట్ వైపు మార్చ్ చేపట్టిన విషయం తెలిసిందే. ఆ సమయంలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. 'ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్' (ఆర్ఏఎఫ్) సిబ్బంది పెల్లెట్ గన్స్ ఉపయోగించారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈ ఘటనలో గాయపడినట్లు పలువురు నిరసనకారులు చెప్పడంతో పాటు వైద్య నివేదికలు కూడా ఉన్నాయని కాంగ్రెస్ పేర్కొంది. అయితే జులై 20న పెల్లెట్ గన్స్ ఉపయోగించలేదని ఢిల్లీ పోలీసులు పలుసార్లు తెలిపారు. ఈ అంశంపై సీఆర్‌పీఎఫ్ మాత్రం ఇప్పటివరకు స్పందించలేదు. మరోవైపు, గాయపడిన నిరసనకారుల వాంగ్మూలాలు, వైద్య నివేదికలు పెల్లెట్ గన్స్ వాడలేదన్న వాదనపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని కాంగ్రెస్ పేర్కొంది.

## వైభవంగా వరలక్ష్మి పూజలు..

**మహాలక్ష్మికి మహిళల నీరాజనాలు**

**రాజేంద్రనగర్ వ్యాప్తంగా ఆలయాల్లో సామూహిక వరలక్ష్మి వ్రతాలు,ప్రత్యేక పూజా కార్యక్రమాలు**

**రాజేంద్రనగర్,ఆగస్టు21(ప్రభాత ఉదయం)**

వరాలిచ్చే మహాలక్ష్మి మమ్మల్ని చల్లగా చూసి.. వరాలు ఇమ్మని వేడుకుంటూ మహిళలు పూజలు చేశారు.అమ్మ అనుగ్రహంతో ప్రతీఇంటా సిరిసంపదలు చేకూరుతాయని నిర్వహించే వరలక్ష్మి వ్రతాలు రాజేంద్రనగర్ నియోజకవర్గంలో శుక్రవారం వైభవంగా సాగాయి.బస్తీల్లోని ఇళ్లలో మొదదలుకొని నియోజకవర్గం అంతటా ఆలయాల్లో భక్తులు అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిచారు.అమ్మవారికి స్వాగత సూచికగా ఇళ్లముందు మహిళమనులు ముగ్గులుపెట్టి మామిడితోరణాలతో వరలక్ష్మికి ఘనస్వాగతం పలికారు.మహిళలు మహాలక్ష్మిదేవికి పంచామృతాభిషేకాలు నిర్వహించి వరలక్ష్మి వ్రతమహత్యాన్ని తెలుసుకున్నారు.ముత్తైదువులకు వాయనాలు ఇచ్చి పది కాలాల పాటు సుమంగళిగా ఉండే విధంగా ఆశీస్సులు అందుకున్నారు.వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకుని మహిళ మణులు ఉదయం నుంచే పూజాది కార్యక్రమాలకు ఉపక్రమించారు.కాగా,స్థానిక ఆలయాల్లో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు.సర్కిల్ పరిధిలోని వాసవి కన్యకాపరమేశ్వరీ దేవాలయం,దుర్గామాత దేవాలయం,వెంకటేశ్వర స్వామి దేవాలయం, ఉమా రామలింగేశ్వర ఆలయం,మహాలక్ష్మి ఆలయంతో పాటు ఆలయాల్లో పూజలు కొనసాగాయి.యేడాదికి ఒకసారి సుహాసినులు ఈ వ్రతం చేయడం వల్లహకోరికలు నెరవేరుతున్నాయని పురోహితులు తెలిపారు.లక్ష్మిదేవిని పూజిస్తే సిరిసంపదలు చేకూరుతాయని మహిళలు విశ్వసిస్తారు.

## కాక్రోచ్ పార్టీ కార్యకర్తలపై గ్రామస్థుల దాడి!

మొదటి పేజీ తరువాయి...

రాంపురా-కన్వర్‌పురా గ్రామంలో ప్రభుత్వ పాఠశాల పరిస్థితిని పరిశీలించేందుకు సీజేపీ బృందం వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగినట్లు రంకా తెలిపారు. ఆ పాఠశాల కొన్నేళ్లుగా గేదెల కొట్టంలో కొనసాగుతోందని ఆయన ఆరోపించారు. గతేడాది కూడా తమ బృందం అక్కడికి వెళ్లిందని, పరిస్థితిలో ఎలాంటి మార్పు కనిపించలేదని చెప్పారు. తమ బృందం అక్కడికి చేరుకునేలోపే కొంతమంది బీజేపీతో సంబంధం ఉన్న వ్యక్తులు అక్కడ ఉన్నారని, అనంతరం ఒక్కసారిగా దాడి జరిగిందని రంకా ఆరోపించారు. తమ వాహనాల అద్దాలు పగలగొట్టారని, మొబైల్ ఫోన్లు ధ్వంసం చేశారని, మహిళా కార్యకర్తపై దాడి చేశారని చెప్పారు. తన చొక్కా కూడా చించివేశారని పేర్కొన్నారు. ఓ కార్యకర్త చేయి విరిగిందని, తమపై రాళ్ల దాడి కూడా జరిగిందని ఆరోపించారు. పోలీసులకు ముందే సమాచారం ఇచ్చినా వారు ప్రేక్షక పాత్ర పోషించారని రంకా ఆరోపించారు. మహిళా కార్యకర్తలపై కూడా రాళ్లు విసిరి, వారి ఫోన్లు ధ్వంసం చేశారని చెప్పారు. ఈ దాడి ముందస్తు ప్రణాళికతోనే జరిగిందని ఆయన ఆరోపించారు. పాఠశాల తనిఖీలపై విధించిన ఆంక్షలను కూడా వెంటనే ఉపసంహరించుకోవాలని రంకా డిమాండ్ చేశారు. 48 గంటల్లో నిందితులపై చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈసారి పోరాటం కేవలం పాఠశాలల సమస్యలకే పరిమితం కాదని, మంత్రి మదన్ దిలావర్ రాజీనామాను కూడా డిమాండ్ చేస్తామని స్పష్టం చేశారు. కాగా, సీజేపీ బృందం పాఠశాల ప్రాంగణంలోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో స్థానిక గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని ఉద్రిక్తత పెరిగింది. ఘటనకు సంబంధించి నిందితుల వివరాలు, పోలీసుల తదుపరి చర్యలపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## ప్రముఖ నటి షావుకారు జానకి కన్నుమూత

**హైదరాబాద్, ఆగస్టు 21 (ప్రభాత ఉదయం)**

ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి (94) కన్నుమూశారు. చెన్నైలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతూ తుది శ్వాసవిడిచారు. ఆమె గత కొంత కాలంగా శ్వాసకోశ, వృద్ధాప్య సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల మరోసారి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు చెన్నైలోని కావేరి ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో ఆమె కన్నుమూశారు. షావుకారు జానకి.. నటి కృష్ణకుమారికి సోదరి. ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరంలో 1931 డిసెంబర్ 12న జన్మించారు. చిన్నతనంలోనే నాటకాల్లో పలు పాత్రలు పోషిస్తూ కెరీర్ ప్రారంభించారు. 11 ఏళ్లకు రేడియోలో ఒక తెలుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. 1949లో 'రక్షా రేఖ' సినిమాతో చలనచిత్ర రంగంలోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత 1950లో 'షావుకారు' సినిమా హిట్ కావడంతో ఆమెకు షావుకారు జానకిగా పేరు వచ్చింది. ఆ తర్వాత అనేక సూపర్ హిట్ చిత్రాల్లో జానకి నటించారు. తెలుగు, తమిళ, కన్నడ భాషలలో సుమారు 400 చిత్రాల్లో, 3 హిందీ సినిమాల్లోనూ, ఒక మలయాళ చిత్రంలో నటించి మెప్పించారు. సినీ రంగానికి ఆమె చేసిన సేవలకు గాను భారత ప్రభుత్వం ఆమెను 2022లో పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది.

**ఇల్లు గడవక నటిగా మారి.. షావుకారు జానకి జీవితమిది..**

'వద్దంటే డబ్బు', 'కన్యా శుల్కం', 'పిచ్చి పుల్లయ్య' , 'రేచుక్క-పగటిచుక్క, 'రోజులు మారాయి', 'సొంతవూరు', 'జయం మనదే', 'డాక్టర్ చక్రవర్తి', 'సంసారం ఒక చదరంగం', 'తోడికోడళ్ళు', 'బాబు బంగారం', 'గీతాంజలి' ఇలా అనేక హిట్ చిత్రాలలో జానకి నటించారు. చివరి సారి 'అన్నీ మంచి శకునములే'లో ఆమె కనిపించారు.



## చివరి నిమిషంలో రేవంత్ అమెరికా టూర్ రద్దు

మొదటి పేజీ తరువాయి...

అనూహ్య పరిణామం ఎదురైంది. యూకేలో జరిగే సమావేశాలకు మాత్రమే అనుమతి లభించింది. అమెరికాలో నిర్వహించా ల్సిన సమావేశాలకు గ్రీన్‌సిగ్నల్ రాలేదు. దీంతో సీఎం తన పర్యటనను కుదిం చుకుని హైదరాబాద్‌కు తిరిగి రావాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అయితే, కేంద్రం నిర్ణయం వెనక కారణం ఏంటనేది మాత్రం ఇంకా అధికారికంగా తెలయరాలేదు. ప్రస్తుతం రద్దయిన అమెరికా పర్యటనను వచ్చే నెలలో చేపట్టాలని సీఎం భావిస్తున్నట్లు సమాచారం. ఈసారి అమెరికాలో జరగాల్సిన భేటీలకు సీఎం స్వయంగా వెళ్లకుండా అధికారుల బృందాన్ని పంపే యోచన కూడా ఉన్నట్లు తెలుస్తోంది. తన అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరణపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయాలకు అతీతంగా తెలంగాణ యువత భవిష్యత్తు, రాష్ట్ర అభివృద్ధే తన తొలి ప్రాధాన్యమని స్పష్టం చేశారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా 'తెలంగాణ రైజింగ్' ప్రయాణం ఆగదని ధీమా వ్యక్తం చేశారు.

## తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఊరట

మొదటి పేజీ తరువాయి...

రాయదుర్గం పాన్ మక్తాలోని సుమారు 11 ఎకరాల భూమిని వేలం వేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎకరాకు కనీస ధరను రూ.175 కోట్లుగా నిర్ణయించింది. ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ జువ్వాడి ప్రణయ సింహారావు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది నీరజ్ కిషన్ కౌల్ వాదనలు వినిపిస్తూ, గతంలో కంచ గచ్చిబౌలిలోని భూముల వేలాన్ని సుప్రీంకోర్టు నిలిపివేసిందని, ప్రస్తుతం ప్రభుత్వం అవే రక్షిత భూములను వేలం వేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అయితే, తెలంగాణ ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ ఈ ఆరోపణలను తోసిపుచ్చారు. పిటిషనర్ కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన వాదించారు. ప్రస్తుతం వేలానికి ఉంచిన రాయదుర్గం భూములకు, గతంలో స్టే ఇచ్చిన కంచ గచ్చిబౌలి భూములకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ రెండు ప్రాంతాల మధ్య దాదాపు 5 కిలోమీటర్ల దూరం ఉందన్న విషయాన్ని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో రాయదుర్గం భూముల వేలం ప్రక్రియకు మార్గం సుగమమైంది.

## కాంగ్రెస్ నేతలను విమర్శించలేదు

**మరోమారు రాజగోపాల్ రెడ్డి వివరణ**

**యాదాద్రిభువనగిరి,ఆగస్ట్21 (ప్రభాత ఉదయం)**

కాంగ్రెస్‌లో బయట నుంచి వచ్చిన నాయకుల పెత్తనం ఎక్కువైందని మాత్రమే తాను చెప్పానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. తానుచేసిన ఈ వ్యాఖ్యలపై మరోసారి మీడియాకు ఆయన క్లారిటీ ఇచ్చారు. శుక్రవారం యాదాద్రి జిల్లాలోని చౌటుప్పల్ సీతారామచంద్రస్వామి ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రాజ్‌గోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్‌లోనే ఉంటానని స్పష్టం చేశారు. తానెక్కడా కాంగ్రెస్ నాయకులను విమర్శించలేదని, విమర్శించనని రాజ్‌గోపాల్ రెడ్డి తేల్చిచెప్పారు. నిజమైన కాంగ్రెస్ నాయకులను అణిచివేస్తున్నారనే విషయాన్ని తాను గుర్తు చేశానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో భాగంగా ఉద్యమకారులకు గుర్తింపు ఉండాలని సూచించారు. సీమాంధ్ర పాలకులు, సీమాంధ్ర మీడియా చెప్పుచేతల్లో తెలంగాణ కాంగ్రెస్, ప్రభుత్వం నడపవద్దని కోరారు. ప్రజాపాలన అంటే పేదల కోసం పని చేయాలని సూచించారు. పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్లకు సీమాంధ్ర నాయకుల కోసం కాదని తెలిపారు. తెలంగాణ ఇచ్చింది, తెచ్చింది కాంగ్రెస్ పార్టీనే అని ప్రస్తావించారు. తెలంగాణ అభివృద్ధి కూడా కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

## ఇస్నాపూర్ మున్సిపల్ సమగ్ర అభివృద్ధే లక్ష్యం




**ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత**

**రుద్రారం, పాశమైలారం, చిట్కుల్ వార్డుల్లో రూ.2.70 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**పటాన్ చెరు, ఆగస్టు 21 (ప్రభాత ఉదయం):**

ఇస్నాపూర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి కాలనీలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. శుక్రవారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రుద్రారం, పాశం మైలారం, చిట్కుల్ వార్డుల్లో సుమారు రూ.2.70 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అంతర్గత మురుగు నీటి కాలువల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు.మున్సిపాలిటీలోని ప్రతి వార్డును సమానంగా అభివృద్ధి చేయడంతో పాటు, కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి వాటికి శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తారని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను నిరంతరం కొనసాగిస్తూ.. ఇస్నాపూర్ మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉంటామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుమలత శ్రీకాంత్, మాజీ ఎంపీపీలు శ్రీశైలం యాదవ్, గాయత్రి పాండు, కౌన్సిలర్లు పాండు, సంధ్య నవీన్ రెడ్డి, లత వెంకటేష్, రాజు, ఆంజనేయులు, వెంకటేష్, అరుణ్, కో ఆప్షన్ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, బాబా, అసీయ బేగం, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సుధీర్ రెడ్డి, కృష్ణ, రాజు, బండ రాజు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# భవిష్యత్తులో సాగులో యంత్రీకరణ తప్పనిసరి

## తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డా. డి. రాజి రెడ్డి





**రాజేంద్రనగర్, ఆగస్టు 21(ప్రభాత ఉదయం)**

భవిష్యత్తులో సాగులో యంత్రీకరణ తప్పనిసరి కానుందని శ్రీ కొండ లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డా. డి. రాజి రెడ్డి వివరించారు. రాజేంద్రనగర్‌లోని కూరగాయల పరిశోధనా కేంద్రంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన అన్నారు. యంత్రీకరణ ఇప్పుడు పెద్ద స్థాయి వ్యవసాయానికి మాత్రమే పరిమితం కాకుండా, కూరగాయల పంటలు, పండ్ల తోటల్లో కూడా విస్తృతంగా ఉపయోగపడుతూ, రైతులకు అధిక ఉత్పాదకత, తక్కువ శ్రమ తో, స్థిరమైన సాగు పద్ధతులను అందిస్తుందన్నారు.ఆధునిక ప్లాంటర్లు, ట్రాన్స్‌ప్లాంటర్లు ద్వారా నాట్లు సమానంగా, వేగంగా జరగడం వల్ల రైతుల శ్రమ తగ్గి దిగుబడి పెరుగుతుంది. యాంత్రిక వీడర్లు, పవర్ టూల్స్ ద్వారా కలుపు నియంత్రణ సులభతరం అవుతుంది, రసాయనాలపై ఆధారపడటం తగ్గుతుంది. ప్రెసిషన్ స్ప్రేయర్లు , డ్రోన్ల వినియోగం ద్వారా ఎరువులు, పంట సంరక్షణ మందులు లక్ష్యపూర్వకంగా పిచికారీ చేయబడతాయి, కాబట్టి, వాటి వృథా తగ్గి పర్యావరణానికి రక్షణ లభిస్తుంది అని డాక్టర్ రాజి రెడ్డి అన్నారు. అదేవిధంగా, స్మార్ట్ సెన్సర్లు, డ్రోన్లు, డిజిటల్ పరికరాల ద్వారా పంట పెరుగుదల, నేల ఆరోగ్యం, పురుగుల ప్రబలతపై తక్షణ సమాచారం అందుతుంది అని తెలిపారు. ఈ సాంకేతికతలు కాలానుగుణ, వాతావరణ-స్నేహపూర్వక వ్యవసాయానికి కీలకమని, రైతులు, పరిశోధకులు, విద్యార్థులు యంత్రీకరణ లో మెళకువలు నేర్చుకోవటం ద్వారా స్థిరమైన ఉద్యాన అభివృద్ధి సాధ్యమవుతుందని సూచించారు. కార్యక్రమం లో ఇ మెషిన్ కంపెనీ ప్రతినిధి త్రివిక్రమ్ పలు రోబోటిక్ మెషినరీ ప్రదర్శించి, పని తీరుని వివరించారు. కార్యక్రమంలో వర్సిటీ డైరెక్ట్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ లక్ష్మీనారాయణ, ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి. ప్రశాంత్, కూరగాయల పరిశోధన స్థానం హెడ్ వి. మురళి, యూనివర్సిటీ సీడ్ సెల్ సీడ్ ఆఫీసర్ డాక్టర్ పిడిగం సైదయ్య, సైంటిస్ట్ డా. నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.



## పద్మశాలిపురం పోచమ్మ దేవాలయంలో ఘనంగా ప్రత్యేక పూజలు

**రాజేంద్రనగర్,ఆగస్టు21(ప్రభాత ఉదయం)**

మైలార్ దేవుపల్లి డివిజన్ పరిధిలోని పద్మశాలిపురం బస్తీలో పునర్నిర్మించిన పోచమ్మ దేవాలయం 41 రోజులు పూర్తయిన సందర్భంగా శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక యజ్ఞం,అభిషేకాలు,ప్రత్యేక పూజలు,అన్నదాన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఉదయం నుంచే దేవాలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు,హోమ కార్యక్రమాలు చేపట్టారు. పద్మశాలిపురం బస్తికి చెందిన మహిళలతో పాటు మైలార్ దేవుపల్లి డివిజన్ పరిధిలోని చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై యజ్ఞంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.శ్రావణ మాసంలో శుక్రవారం రోజున అమ్మవారిని పూజిస్తే కుటుంబంలో సుఖసంతోషాలు, ఆరోగ్యం,శాంతి కలుగుతాయని భక్తుల విశ్వాసం.దీంతో మహిళలు ప్రత్యేకంగా పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.దేవాలయ పునర్నిర్మాణం అనంతరం 41 రోజులు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంతో బస్తీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.దేవాలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు కాశిగారి యాదగిరి,మహేష్ రాజ్,మునగపాటి వెంకటేష్,మహిపాల్, ఎల్లప్ప,రుద్రకుమార్,చందన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు కిస్మత్‌పూర్ విద్యుత్ సరఫరాల అంతరాయం

**బండ్లగూడ, ఆగస్టు 21(ప్రభాత ఉదయం)**



కిస్మత్ పూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ మల్లేష్ రాజ్ తెలిపారు. సెక్షన్ పరిధిలోని స్నేహిత హిల్స్ విద్యుత్ సెక్షన్ పి అండ్ టి కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 02:00 నుండి 02:30 వరకు విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందన్నారు. ఈ ఫీడర్ పరిధిలోని ప్రాంతాలైన బైరాగి గూడ, భవాని కాలనీ, బుండ్లగూడ గ్రామం, చెవెళ్ల,చింతల్‌మెట్ టవర్స్, సిటి మీటర్స్,హిమాయత్‌సాగర్, డి డి కాలనీ, గండంగూడ, హిమాగిరి కాలనీ, హెచ్‌వి బండ్లగూడ, హెచ్‌వి నెట్ మీటర్స్, హెచ్‌వి పిడిటి సన్ సిటీ, హైదర్‌షకోటే, జెఎల్ఎన్ఎస్ కాలనీ, కాలికా నగర్, కపిల్ నగర్, పిడిటి కాలనీ, పిడిటి కాలనీ సి-బ్లాక్,పీరం చెరు, రాధా నగర్, ఆర్ జి జి వై గృహ (పీరంచేరు), సాయి హర్ష కాలనీ, సాయిరామ్ నగర్ కాలనీ, ఎస్ ఎం ఆర్ బిల్డర్స్, శ్రీనివాస్ నగర్ కాలనీ, ఎస్ టి ఎల్, ఈ డబ్ల్యూ ఎస్ , గంధంగూడ, సన్‌సిటీ, నగర్‌వీధి, తదితర ప్రాంతాల నుండి ఉదయం. 11:00 నుండి మధ్యాహ్నం 01:00 వరకు కిస్మత్‌పూర్ సబ్‌స్టేషన్ ఎల్వీ ప్రసాద్ ఫీడర్‌లి విద్యుత్ ఆపివేయబడుతుందన్నారు. కే టి టి కాలనీ, శ్రీ బాలాజీ ఎన్‌క్లేవ్, రాజా సేత్ర, గిరిధారి, గిరిధారి విస్తాస్, దర్గా, వి కశక్, దర్గా నమహా విల్లాస్, ఎలైట్ కన్‌స్ట్రక్షన్స్, ఇన్ఫోసిటీ ఇన్‌ఫ్రాటెక్ కన్‌స్ట్రక్షన్, నమో ఇన్‌ఫ్రా, మాఫర్ కన్‌స్ట్రక్షన్, 80 గజాలు ఒ 60 యార్డ్స్, లార్డ్స్ కాలేజ్, ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్ దర్గా మొదలైన ప్రాంతాలలో ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు కిస్మత్‌పూర్ ఎస్.ఎస్ లోని డిఫెన్స్ కాలనీ ఫీడర్‌లి విద్యుత్ సరఫరానిలిపివేయబడుతుందన్నారు. ఆర్ వి నిర్మాణ్, ట్రంఫ్ విల్లా, సాయిబాబా కాలనీ, డిఫెన్స్ కాలనీ, రామ్ కీ విల్లా, ఖాదర్ ఎన్ఆర్ఐ, అక్షర పాఠశాల పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.



## కాంట్రాక్టు కార్మికులకు సీడీఎంఏ ఆదేశాలు అమలు చేయాలి..

**రాజేంద్రనగర్,ఆగస్టు21(ప్రభాత ఉదయం)**

తెలంగాణ మున్సిపల్ సిబ్బంది కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికుల సంఘం (ఏఐటీయూసీ)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి,రాష్ట్ర ఉపాధ్యక్షులు కమతం యాదగిరి అమంగల్ మున్సిపల్ కమిషనర్ ఎస్.రాఘవేందర్ రెడ్డిని కలిసి సీడీఎంఏ కమిషనర్ కార్యాలయం నుంచి జారీ చేసిన మెమో నంబర్ 1036113/2026/జీ2,తేదీ 17-08-2026ను అమలు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ...ప్రతి నెల కార్మికుల వేతనాల నుంచి యజమాని,ఉద్యోగి వాటా ఉద్యోగుల భవిష్యనిధి,ఉద్యోగుల రాష్ట్ర బీమా మొత్తాలను సంబంధిత కార్యాలయాలకు చెల్లించడంతో పాటు భవిష్యనిధి వెబ్‌సైట్‌లో వివరాలను ఎలాంటి లోపాలు లేకుండా నమోదు చేయాలని కోరారు.కార్మికులకు భవిష్యనిధి వివరాల పత్రాలు అందజేయాలని, మినహాయించిన కరువు భత్యం బకాయిల మొత్తాలను సంబంధిత రెగ్యులర్ కార్మికులు,ఉద్యోగుల భవిష్యనిధి ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు మాస్కులు,చేతి తొడుగులు,నూనె,సబ్బులు,చెప్పులు తదితర భద్రతా పరికరాలు,సంక్షేమ వస్తువులను క్రమం తప్పకుండా తగిన మోతాదులో అందించాలని సూచించారు.ప్రభుత్వం జారీ చేసిన జీవోఆర్‌టీ నంబర్ 4459,2006 డిసెంబర్ 27 మార్గదర్శకాల ప్రకారం కార్మికులకు సంవత్సరానికి 15రోజుల సాధారణ సెలవులు కల్పించాలని,సెలవులు వినియోగించుకున్నందుకు వేతనాల్లో కోత విధించకుండా వాస్తవ కాంట్రాక్టు,ఔట్‌సోర్సింగ్ సేవా కాలానికి అనుపాతంగా సెలవులు మంజూరు చేయాలని కోరారు.ఒప్పంద కార్మికుల నియంత్రణ,రద్దు నిబంధనలు 1971లోని 8,9 నిబంధనల ప్రకారం రొటేషన్ పద్ధతిలో కాంట్రాక్టు,ఔట్‌సోర్సింగ్ కార్మికులకు వారానికి ఒక రోజు వారాంతపు సెలవు,సంవత్సరానికి ఎనిమిది జాతీయ,పండుగ సెలవులు కల్పించాలని డిమాండ్ చేశారు.సీడీఎంఏ కార్యాలయం నుంచి జారీ చేసిన మెమోలో పేర్కొన్న ఆదేశాలను అన్ని పట్టణ స్థానిక సంస్థల్లోని కమిషనర్లు ఎలాంటి లోపాలు లేకుండా కచ్చితంగా అమలు చేయాలని జైపాల్ రెడ్డి కోరారు.దీనిపై స్పందించిన అమంగల్ మున్సిపల్ కమిషనర్ ఎస్.రాఘవేందర్ రెడ్డి సీడీఎంఏ కమిషనర్ జారీ చేసిన ఆదేశాలను తప్పకుండా అమలు చేస్తామని హామీ ఇచ్చారు.



## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

### విద్యలో వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

### మెనూ ప్రకారం రుచికరమైన భోజనం వడ్డించాలి:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు 21(ప్రభాత ఉదయం)**

ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలని, ప్రణాళికాబద్ధంగా చదివి మంచి ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.శుక్రవారం ధరూర్ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులతో మాట్లాడి వారి చదువు, అభ్యసన సామర్థ్యాలను తెలుసుకున్నారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఇప్పటి నుంచే ప్రణాళికతో బోధన చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ అందించడంతో పాటు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా పాల్గొనేలా ప్రోత్సహించాలని తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరై శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు పోషకాహారంతో కూడిన భోజనం అందించాలని ఆదేశించారు. వంట, స్టోర్ గదులను పరిశీలించి పరిశుభ్రతను పాటించాలని సూచించారు. కేజీబీవీకి సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించిన కలెక్టర్ తగు సూచనలు చేశారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను పూర్తిస్థాయిలో కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. పాఠశాలలో జరుగుతున్న మౌలిక వసతుల పనులను కలెక్టర్ పరిశీలించారు. విద్యుత్, డ్రైనేజీ సమస్యలను సిబ్బంది కలెక్టర్ దృష్టికి తీసుకురాగా సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ నందిని, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.





గణేష్ గుప్తను గజమాలతో సన్మానిస్తున్న కాటేదాన్ ఆర్య వైశ్య సంఘం నాయకులు

## ఘనంగా గణేష్ గుప్త జన్మదిన వేడుకలు

**శంషాబాద్, ఆగస్టు 21 (ప్రభాత ఉదయం)**

శంషాబాద్ మాజీ సర్పంచ్, ఆర్యవైశ్య సంఘం నాయకుడు గణేష్ గుప్త జన్మదిన వేడుకలు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, బంధువులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం శంషాబాద్ లోని ఆయన స్వగృహంలో గణేష్ గుప్త జన్మదిన సందర్భంగా కాటేదాన్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆయన చేతుల మీదుగా కేక్ కట్ చేయించి గజమాలతో సన్మానించారు. గణేష్ గుప్తను సన్మానించిన వారిలో డాక్టర్ అనంతగుప్తా, అర్థం లక్ష్మి గుప్తా, సిరంగి బుచ్చయ్య గుప్త, సోమ శ్రీనివాస గుప్తా, ఊరే శ్రీనివాస్ గుప్తా, కె రామలింగయ్య గుప్తా, వెంకటరమణ గుప్తా,లు ఉన్నారు.



## రైతులు స్థిరమైన వ్యవసాయ వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవాలి

### 14 రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు సాధికారత..

**రాజేంద్రనగర్,ఆగస్టు21(ప్రభాత ఉదయం)**






నాబార్డ్ ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కార్యాలయం సహకారంతో, ఎ-ఐడియా,ఐసీఏఆర్-ఎన్ఏఏఆర్ఎం సంయుక్తంగా నిర్వహించిన అగ్రిగతివర్ధన్ రైతు ఉత్పత్తిదారుల సంఘాల అభివృద్ధి కార్యక్రమం విజయవాడలో ముగిసింది.ఆగస్టు20న నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులు,నాబార్డ్ అధికారులు, మార్గదర్శకులు,బ్యాంకర్లు,వివిధ సంస్థల ప్రతినిధులు,కొనుగోలుదారులు, ఇతర భాగస్వాములు కలిపి 40మంది పాల్గొన్నారు.18 నెలలపాటు కొనసాగిన ఈ కార్యక్రమంలో 14 రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు వ్యాపార మార్గదర్శకత్వం, సామర్థ్య పెంపు,సాంకేతిక పరిజ్ఞానం,మార్కెట్ అనుసంధానం,క్షేత్ర పర్యటనలు,ఆర్థిక సలహాలు అందించారు. సంఘాల పాలనను మెరుగుపరచడం,విలువ జోడింపు పెంచడం,బ్రాండింగ్,ప్యాకేజింగ్ బలోపేతం చేయడం,మార్కెట్ అవకాశాలను విస్తరించడం ద్వారా వేలాది మంది రైతులకు ప్రయోజనం చేకూరేలా కార్యక్రమాన్ని అమలు చేశారు.ముగింపు కార్యక్రమానికి నాబార్డ్ ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కార్యాలయం ఉప ప్రధాన వ్యవస్థాపక అధికారి ఖాలిద్ అన్సారీ ముఖ్యఅతిథిగా హాజరై రైతు ఉత్పత్తిదారుల సంఘాలు సాధించిన పురోగతిని అభినందించారు. సంఘాలు సమిష్టిగా పనిచేస్తూ విలువ జోడింపు,మార్కెట్ అనుసంధానాలపై దృష్టి సారించి రైతుల జీవనోపాధిని మెరుగుపరిచే స్థిరమైన వ్యవసాయ వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.ఎస్ఎల్‌బీసీ-ఏపీ సహాయ ప్రధాన వ్యవస్థాపక అధికారి శ్రీనివాసరావు రైతు ఉత్పత్తిదారులసంఘాలు,నాబార్డ్,ఎ-ఐడియా,బ్యాంకులు, ఇతర భాగస్వాముల సమష్టి కృషిని అభినందించారు.సంఘాల వ్యాపార విస్తరణకు మెరుగైన రుణ సదుపాయాలు,ఆర్థిక సమ్మిళిత ప్రాధాన్యతను వివరించారు. ఎ-ఐడియా ముఖ్య కార్యనిర్వహణ అధికారి,ఐసీఏఆర్-ఎన్ఏఆర్ఎం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రంజిత్ కుమార్ మాట్లాడుతూ..నిరంతర మార్గదర్శకత్వం, ఆవిష్కరణలు, సంస్థాగత సహకారంతో రైతు ఉత్పత్తిదారుల సంఘాలను స్థిరమైన,మార్కెట్ ఆధారిత సంస్థలుగా బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో 14 రైతు ఉత్పత్తిదారుల సంఘాలు తమ విజయగాథలు,వ్యాపార పురోగతిని నాబార్డ్,ఎ-ఐడియా నిపుణుల బృందం ముందు వివరించాయి.ఆంధ్రప్రదేశ్‌లో రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఆధ్వర్యంలో వ్యవసాయ వ్యాపార అభివృద్ధిని మరింత బలోపేతం చేయాలనే నూతన సంకల్పంతో కార్యక్రమం ముగిసింది.

# ఘనంగా గణేష్ గుప్తా జన్మదిన వేడుకలు



గణేష్ గుప్తా కు శుభాకాంక్షలు తెలుపుతున్న చేవెళ్ల ప్రసాద్ తదితరులు.



గణేష్ గుప్తా కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న తీగల సాయి, కోటేశ్వర్ గౌడ్



జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ఆర్య వైశ్య నాయకులు.

### శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్.

### వివిధ పార్టీల నాయకులు అభిమానులతో సందడిగా మారిన నివాస గృహం

**శంషాబాద్. ఆగస్టు 21 (ప్రభాత ఉదయం )**

కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు రాజేంద్రనగర్ నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, శంషాబాద్ మాజీ సర్పంచ్ ఆర్. గణేష్ గుప్తా జన్మదిన వేడుకలను అభిమానులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శంషాబాద్ లోని ఆయన నివాస ప్రగాణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ వేడుకలో కుటుంబం సభ్యులతో పాటు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొని పుష్పగుచ్ఛాన్ని అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతోపాటు సీనియర్ నాయకులు కోడిగంటి చంద్రారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిల్కమర్రి మహేందర్ ముదిరాజ్ పార్టీ నాయకులు దూడల వెంకటేష్ గౌడ్, జహంగీర్ ఖాన్, కొలను మహేందర్ రెడ్డి, తోకల మురళీకృష్ణ యాదవ్, సత్యేంద్రియ వేణు మాధవరెడ్డి , పారేపల్లి శ్రీనివాస్ గౌడ్, జ్ఞానేశ్వర్ యాదవ్, ఇప్పనుంతల అజయ్, తోట రాములు



గణేష్ గుప్తా తో ఓరుగంటి మల్లేష్ గుప్తా

ముదిరాజ్, తోట విట్టల్ ముదిరాజ్, ఈదుల నరసింహ గౌడ్, తోట రామకృష్ణారెడ్డి, చేవెళ్ల ప్రసాద్ , మామిళ్ల అర్జున్ యాదవ్, చిన్న మాదిరెడ్డి శివారెడ్డి, టిడిపి జంగయ్య తదితరులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపినవారిలో వున్నారు.

**హుడా కాలనీ నుంచి. ర్యాలీ గా**

శంషాబాద్ సీనియర్ నాయకులు రాజేంద్రనగర్ నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే గణేష్ గుప్తా పుట్టినరోజు వేడుకలు శంషాబాద్ లో ఘనంగా జరిగాయి. శంషాబాద్ హుదాకాలానికి చెందిన యువనాయకులు తీగల సాయి ముదిరాజ్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున యువకులు ర్యాలీగా బయలుదేరి గణేష్ గుప్తా కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో సాయి ముదిరాజ్, కోటేశ్వర్ గౌడ్ పాల్మకుల సర్పంచ్, మహేందర్ ముదిరాజ్ లతో పాటు పలువురు యువకులు పాల్గొన్నారు.

**వాసవి కన్యాకాపరమేశ్వరి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో....**

కాటేదాన్ శ్రీ వాసవి కన్యాకాపరమేశ్వరి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో లో ఆర్యవైశ్య మహాసభ నాయకులు, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే గణేష్ గుప్తా పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ సోమ శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు భారీ ఎత్తున గణేష్ గుప్తా నివాసానికి చేరుకొని పుష్ప గుచ్ఛమ్ అందించి కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమం లో సోమ శ్రీనివాస్ గుప్తా, డాక్టర్ అనంతం గుప్త, ఆర్టం లక్ష్మయ్య గుప్తా, రామలింగయ్య గుప్తా, బుచ్చయ్య గుప్తా, సురేష్ గుప్తా, ఓరుగంటి మల్లేష్, వెంకట రమణ గుప్తా, రవి గుప్తా, ఆయిల్ శేఖర్, ఆర్టం శ్రీనివాస్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అందుకే సీఎం రేవంత్ పర్యటనకు అనుమతి నిరాకరణ

## విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వివరణ

**న్యూఢిల్లీ,ఆగస్ట్21 హైదరాబాద్, ఆగస్టు 21 (ప్రభాత ఉదయం)**




తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వలేదు. దీనిపై విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పందించింది. శుక్రవారం న్యూఢిల్లీలో ఆ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వివరణ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి బ్రిటన్ పర్యటనకు కేంద్రం క్లియరెన్స్ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే సీఎంలు, ఇతర ప్రముఖుల పర్యటనలను.. రాజకీయ క్లియరెన్స్ కోసం అంచనా వేస్తామని ఆయన వివరించారు. ప్రతిపాదిత కార్యక్రమం పదవికి, పర్యటన ఉద్దేశానికి అనుగుణంగా ఉండాలని ఈ సందర్భంగా జైస్వాల్ స్పష్టం చేశారు. అమెరికా పర్యటన అంశంలో అలా లేదన్నారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి యూఎస్ పర్యటనకు క్లియరెన్స్ నిరాకరించామని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. 10 రోజుల విదేశీ పర్యటన కోసం సీఎం రేవంత్ రెడ్డి లండన్‌కు బయలుదేరి వెళ్లారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం కోసం న్యూఢిల్లీ వెళ్లిన ఆయన బుధవారం అర్ధరాత్రి తర్వాత అక్కడి నుంచి బయలుదేరి విదేశాలకు వెళ్లారు. ముందుగా అనుకున్న ప్రకారం.. ఆగస్టు 30వ తేదీ వరకు బ్రిటన్, అమెరికాల్లో సీఎం బృందం పర్యటించ నుంది. ఈ రెండు దేశాల్లోని వివిధ యూనివర్సిటీలను సందర్శించి తెలంగాణలో ఉన్నత విద్య, క్రీడల అభివృద్ధిపై ఈ బృందం చర్చించనుంది. అలాగే లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలోని బ్లావట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను సీఎం బృందం సందర్శించనుంది. అక్కడి ఎమిరేట్స్ స్టేడియంలో ఫుట్‌బాల్ ప్రజెంటేషన్‌లో పాల్గొనుంది. అనంతరం యూఎస్‌కు సీఎం బృందం బయలుదేరి వెళ్లాల్సి ఉంది. కానీ సీఎం రేవంత్ అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వ లేదు. దాంతో ఆయన లండన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. అయితే యూఎస్ పర్యటనకు వెళ్లాలని అధికారుల బృందాన్ని సీఎం రేవంత్ ఆదేశించినట్లు తెలుస్తోంది.




## జలమండలి పేరుతో మోసం.. సెప్టిక్ ట్యాంక్ క్లీనర్‌పై కేసు

**హైదరాబాద్, ఆగస్టు 21 (ప్రభాత ఉదయం)**

హైదరాబాద్‌లో జలమండలి పేరు, లోగోను అనధికారికంగా ఉపయోగిస్తూ స్లడ్జ్, సెప్టేజ్ క్లీనింగ్ కార్యకలాపాలు నిర్వహించిన ఘటనపై మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈజీ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ ప్రైవేట్ లిమిటెడ్ కు చెందిన ౨+08ఎ6294 నంబరు వాహనం జలమండలి పేరును ఉపయోగిస్తూ స్లడ్జ్, సెప్టేజ్ క్లీనింగ్ సేవలు అందిస్తున్నట్లు గుర్తించారు. ఈ వ్యవహారం ప్రజలను తప్పుదారి పట్టించేలా ఉండటంతో జలమండలి అధికారులు విషయాన్ని సంబంధిత పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు.దీనిపై మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో సదరు సంస్థ / వాహనానికి సంబంధించి కేసు నమోదు చేసి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు.జలమండలి పేరు, లోగో లేదా అధికారిక గుర్తింపును అనుమతి లేకుండా ఉపయోగిస్తూ సేవలు అందిస్తున్నట్లు చెప్పే వ్యక్తులు, సంస్థలు లేదా వాహనాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జలమండలి సూచించింది.అలాగే, ఇలాంటి ఘటనలు ఎక్కడైనా గుర్తించినట్లయితే వెంటనే సంబంధిత జలమండలి అధికారులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని కోరింది.జలమండలి పేరు, లోగో దుర్వినియోగం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

# భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు







**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు21(ప్రభాత ఉదయం)**

గద్వాల పట్టణం రాఘవేంద్ర కాలనీలోని శ్రీలక్ష్మీ సత్యనారాయణ స్వామి ఆలయంలో శ్రావణమాసం రెండవ శుక్ర వారం పురస్కరించుకొని 51మంది మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, మహామంగళహారతి కార్యక్రమాలు నిర్వహించి, తీర్థప్రసాదాల వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భగవన్నామస్మరణతో మార్మోగాయి. అలాగే వేధానగర్ లోని శ్రీ సరస్వతీ శిశు మందిరం ఆధ్వర్యంలో 31మంది మహిళలతో కలుసి సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు.అమ్మవారికి అ భిషేకం, పంచాతామృతం, కుంకుమార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ చేశారు. ప్రజలందరికీ సుఖలు, శు భాలు కలుగాలని ప్రార్థించారు.

**కేటిదొడ్డి మండల కేంద్రంలోఘనంగా వరలక్ష్మీ వ్రతం**


శ్రావణ శుక్రావారాన్ని పురస్కరించుకుని కేటిదొడ్డి మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో వరలక్ష్మీ వ్రతం పర్వది నాన్ని మహిళలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా తమ ఇళ్లను ప్రత్యేకంగా అలరించుకొని లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. పలు ఆలయాల్లో అమ్మవారలను పూలతో విశేషంగా అలంకరించారు. మహిళలు సామూహిక వ్రతాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఒకరికొకరు వాయినాలు అందజేశారు.




## సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం చేయాలి

### ఆర్అండ్ఆర్ సమస్యలను పరిష్కరించాలి:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 21(ప్రభాత ఉదయం)**



జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల భూ సేకరణ వేగవంతం చేయాలని, ఆర్ అండ్ ఆర్ సమస్యలను పరిష్కరించా లని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.సాగునీటి ప్రాజెక్టుల పురోగతికి భూసేకరణ, ఆర్ అండ్ ఆర్, అటవీ సంబంధిత సమస్యలపై శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు రమేష్ బాబు, శ్రీధర్, శ్రీనివాసులుతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమీక్షించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన నిధులు ఇప్పటికే విడుదల చేసినందున పనులను వేగవంతం చేయాలన్నారు. ప్రాజెక్టుల వారీగా భూములు కోల్పోయిన నిర్వాసితులకు నిర్దేశిత సమయంలోగా పరిహారం చెల్లించాలన్నారు. ఆర్థిక శాఖ నుంచి నిధులు విడుదల కావడం, కలెక్టర్ పీడీ ఖాతాలలో జమ కావడమే చెల్లింపు పూర్తయినట్లు భావించరాదని మంత్రి స్పష్టం చేశారు. మంజూరైన మొత్తం చివరకు సంబంధిత లబ్ధిదారుడికి చేరడమే అసలు లక్ష్యమన్నారు. అవసరమైన అన్ని ప్రక్రియలు పూర్తై నిధులు అందుబాటులో ఉన్న చోట వెంటనే పరిహారం చెల్లించాలని ఆదేశించారు. సాగునీటి ప్రాజెక్టుల పురోగతికి సంబంధించిన అటవీ సమస్యలు, పెండింగ్ చెల్లింపులు, క్లియరెన్సులు, ఇతర అడ్డంకులను గుర్తించి ఇరిగేషన్ శాఖకు వివరాలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం స్థాయిలో జోక్యం అవసరమైన అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తక్షణమే తీసుకెళ్లాలని సూచించారు. భూసేకరణ, పరిహారం చెల్లింపులు, ఆర్ అండ్ ఆర్, అటవీ సమస్యలు, ఆర్థిక అనుమతులు, టోకెన్లు, ఇతర ఆర్థిక, ప్రక్రియాపరమైన కారణాలతో ఏ సాగునీటి ప్రాజెక్టు ఆలస్యమవుతున్నా సంబంధిత కలెక్టర్, చీఫ్ ఇంజినీర్ సమస్యను స్పష్టంగా గుర్తించి వెంటనే ప్రభుత్వానికి నివేదించాలని ఆదేశించారు. ఆయా సమస్యలను సంబంధిత శాఖలతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.గద్వాలలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. వీసి అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులకు తగు సూచనలు చేశారు.ఈ సమావేశంలో భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, నీటిపారుదల శాఖ ఎస్ఈ కేశవరావు, మల్లికార్జున్, తదితరులున్నారు.




టీజీఐఐసీ నిర్వహించిన వెలంలో రికార్డు ధర పలికిన ప్లాటు ఇదే..

## హైటెక్ 'సిరి'కి ఆకాశమే హద్దు!

### రాయదుర్గంలో ఎకరం రూ.264 కోట్లు.. రికార్డులను తిరగరాసిన టీజీఐఐసీ వేలం

### అభివృద్ధి పరుగుల వెనుక ఆలోచించాల్సిన అభద్రతా?

**శేరిలింగంపల్లి : ఆగస్టు 21, (ప్రభాత ఉదయం)**

భాగ్యనగర రియల్ ఎస్టేట్ రంగం సృష్టిస్తున్న అద్భుతాలు ప్రపంచాన్నే ఆశ్చర్యపరుస్తున్నాయి. తాజాగా తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) నిర్వహించిన ఈ-వేలంలో రాయదుర్గం భూములు మునుపెన్నడూ లేని విధంగా ఊహకందని రికార్డు ధరను సాధించాయి. ఐటీ కారిడార్‌లోని అత్యంత కీలకమైన పాన్‌మక్తా ప్రాంతంలో ఉన్న 5.25 ఎకరాల స్థలానికి వేలం నిర్వహించగా, ఎకరం భూమి ఏకంగా రూ.264 కోట్ల అత్యున్నత ధరకు అమ్ముడైంది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గం పాన్ మక్త సర్వే నెంబర్ 83/1లోని 'ప్లాట్ నంబర్ పీ1' గా పిలిచే ఈ స్థలాన్ని ప్రముఖ ఎంఎస్ ఎన్ రియల్టీస్ సంస్థ మొత్తం రూ.1,386 కోట్లకు పైగా వెచ్చించి దక్కించుకుంది. గతంలో కూడ ఇదే సంస్థ ఇక్కడ ఎకరం రూ.237 కోట్లకు కొనుగోలు చేయగా, ఇప్పుడు తమ సొంత రికార్డునే తామే తిరగరాస్తూ రూ.264 కోట్లకు పాడుకోవడం ఐటీ కారిడార్ క్రేజ్‌కు నిదర్శనం.

**రియల్ రికార్డుల హోరు.. గగనతలంలో ఐటీ కారిడార్:**

హైటెక్ సిటీ, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లకు గుండెకాయ లాంటి రాయదుర్గం ప్రాంతం ఇప్పుడు దేశంలోనే అత్యంత ఖరీదైన వాణిజ్య కేంద్రంగా మారింది. అధునాతన మౌలిక వసతులు, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు (జీసీసీ ఎస్), అంతర్జాతీయ స్థాయి ఐటీ కంపెనీల తాకిడి ఈ భూముల ధరలకు రెక్కలు తొడిగింది. కేవలం ఐదు ఎకరాల భూమి వేల కోట్ల రూపాయలు పలకడం హైదరాబాద్ ఆర్థిక శక్తినీ, అంతర్జాతీయ స్థాయి పెట్టుబడుల ఆకర్షణనీ చాటిచెబుతోంది. ఈ వేలం దెబ్బతో చుట్టుపక్కల ప్రాంతాల్లోని రియల్ ఎస్టేట్ రంగానికి మరింత ఊపు లభించినట్లయింది.

అభివృద్ధి మైకంలో ఆశల వేలం.. ఆలోచించాల్సిన నిజాలు:

ఎకరం పాతిక ఎకరాల ధర రూ.260 కోట్లు దాటడం ఆర్థిక పరిపుష్టికి సంకేతమే కావచ్చు, కానీ ఈ నాణేనికి మరోవైపున్న సామాజిక చిత్రాన్ని కూడా విశ్లేషించాల్సి ఉంది. ఆకాశాన్నంటుతున్న ఈ భూముల ధరలు కేవలం బహుళజాతి సంస్థలకు, బిలియనీర్లకు మాత్రమే పరిమితమవుతున్నాయి.

సామాన్యుడికి దూరమవుతున్న నివాస స్వప్నం:

ఐటీ కారిడార్‌లో పనిచేసే మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి ఉద్యోగులకు సొంతింటి కల మరింత భారం కానుంది. భూముల ధరల ప్రభావం రవాణా, నివాస అద్దెలు, రోజువారీ సేవలు, కమర్షియల్ స్పేస్‌లపై పడి అంతిమంగా జీవన వ్యయం విపరీతంగా పెరిగే ప్రమాదం ఉంది.

ఒకవైపు వందల కోట్ల వేలం పాటలు నడుస్తుంటే, మరోవైపు సామాన్య ప్రవక్తలకు ఆ నగరంలో చోటు దొరకని పరిస్థితి ఏర్పడుతోంది.

ఒక నగరం సాధిస్తున్న ఈ అద్భుత ప్రగతి, కేవలం కాంక్రీట్ వనాల్లోని కోట్ల రూపాయల వ్యాపారానికే పరిమితం కాకూడదు. ఆర్థిక వృద్ధికి తోడుగా, సమగ్ర నగర వికాసం, సామాన్యుడికి అందుబాటులో ఉండే మౌలిక సదుపాయాలు లభించినప్పుడే ఈ వికాసానికి పూర్తి సార్థకత చేకూరుతుంది. రాయదుర్గం రికార్డు ధరలు హైదరాబాద్ శక్తినైతే చాటాయి.. కానీ, భావితరాల నగర విస్తరణ ఏ దిశగా సాగాలో అడుగు గడపలో కొత్త ప్రశ్నలను నిలబెట్టాయి.

# విద్యార్థుల పెంపకంలో తల్లిదండ్రులదే పూర్తి బాధ్యత

## రూపా రెడ్డి హత్య నిరసిస్తూ జిల్లా కేంద్రంలో ప్రైవేటు స్కూల్ టీచర్ల ర్యాలీ










**గద్వాల ప్రతినిధి, ఆగస్టు21 (ప్రభాత ఉదయం)**

నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి మండలకేంద్రంలోని నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపల్ కల్లు రూపారెడ్డి హత్యను నిరసిస్తూ తెలంగాణ రికగ్నైజడ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పిలుపుమేరకు శుక్రవారం జిల్లా ట్రస్మా ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని ప్రైవేటు స్కూళ్లు బంద్ పాటించాయి. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో అన్ని ప్రైవేటు స్కూల్ టీచర్లు, యజమాన్యం పాతబస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ముందు రోడ్డు పై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ట్రస్మా జిల్లా అధ్యక్షుడు, బాబు నాయుడు గౌరవాధ్యక్షులు బీచుపల్లి, ప్రధాన కార్యదర్శి మోహిన్ బాష , రాష్ట్ర కమిటి సభ్యులు త్యాగరాజు మాట్లాడుతూ... సభ్య సమాజం సిగ్గుపడేలా 28 ఏళ్ల నుండి పాఠశాల ప్రిన్సిపాల్ గా డైరెక్టర్ గా విద్యార్థులకు పాఠాలు నేర్పుతున్న రూపారెడ్డిని అదే పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు అతి కిరాతకంగా చంపడం హేయమైన చర్య అని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రాష్ట్ర ప్రైవేట్ పాఠశాల యాజ మాన్యానికి, రాష్ట్ర ప్రైవేట్ టీచర్లకు సంపూర్ణమైన భద్రత కల్పించాలన్నారు. సమాజంలో జరుగుతున్న ఘోరాలను ప్రజలు బాధ్యతతో వ్యవహరించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను క్రమశిక్షణతో పెంచాలన్నారు. పాఠశాలలో చదువుకుంటున్న పిల్లలను సోషల్ మీడియా, ఫోన్ల వాడకం, వారి చుట్టూ ఉన్న పరిస్థి తులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. ముఖ్యంగా చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ బాధ్యతతో పిల్లలను పోషించాలన్నారు. ఇలా ప్రతి దానిపై నిఘా పెట్టకపోతే జరిగే ప్రతి అనర్థంలోనూ తల్లిదండ్రులు కూడా భాగస్వాములు అవుతారనే విషయాన్ని మర్చిపోవద్దని తల్లిదండ్రుల బాధ్యతలను గుర్తు చేశారు. నిషేధిత మత్తు పదార్థాలైన గంజాయి సేవించడం సమాజానికి ఎంతో ప్రమాదకరమన్నారు. గంజాయిపై ఉక్కుపాదం మోపాలని నిషేధించడానికి సమాజంలో అందరూ భాగస్వామ్యం కావాలన్నారు. ప్రిన్సిపాల్ రూపారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని వారు సందర్భంగా పేర్కొన్నారు. ఇకముందు ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఈ సంఘటనకు పాల్పడిన విద్యార్థులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు. ప్రైవేటు పాఠశాలలకు యాజమాన్యాలు, ఉపాధ్యాయుల భద్రతకు చర్యలు తీసుకోవాలని వారు సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం, టీచర్లు పాల్గొన్నారు.









వరలక్ష్మి రూపంలో లక్ష్మి దేవి

పూజలో పాల్గొన్న బేబి రూత్విక, దీక్ష శ్రీ, కోట్ల మౌనిక.

# సౌభాగ్యం ఇచ్చి.. చల్లంగా చూడమ్మా

## రాజేంద్రనగర్‌లో ఘనంగా వరలక్ష్మి పూజలు. వీధి వీధి నా... వరలక్ష్మి వ్రతాలూ ... వాయినాలతో సందడి వాతావరణం.

**రాజేంద్రనగర్ : ఆగస్టు 21 ( ప్రభాత ఉదయం )**

వరలక్ష్మి దేవి రావమ్మా..
మా పూజలందుకోవమ్మ.


మా ఇంటి వేల్పు నీవమ్మా
మా కల్పవల్లి రావమ్మా.

మనసారా దీవి నీవమ్మా
మమ్మేలా తల్లి రావమ్మా..

అంటూ తమ సౌభాగ్యములు నిండు నూరేళ్ళ పాటు ఉండాలని పసుపు కుంకుమలకు ( తాళి బొట్టులకు) ప్రత్యేకంగా నిర్వహించే పూజలే వరలక్ష్మి పూజలు. ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజున ఈ వరలక్ష్మి పూజలు మరియు వరలక్ష్మి వ్రతాలు నిర్వహించడం ఆనాయితి. ఈ పండుగ ఏళ్ల తరబడి వస్తున్నా హిందూ సంప్రదాయ పండుగ. ప్రత్యేకంగా ముత్తాయిదులు ( వివహిత మహిళలు ) తను కట్టుకున్న భర్త జీవిత కాలం పాటు ఆయుష్షు పోసుకొని ఐశ్వర్యం, ఆరోగ్యం కలిగి సుఖసంతోషాలతో ఉండాలని వారాలిచ్చే వరలక్ష్మి దేవతకు ( లక్ష్మి దేవికి ) పూజలు చేస్తారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో వరలక్ష్మి పూజలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గం పరిధిలోని రాజేంద్రనగర్, శంషాబాద్, మణికొండ, నార్సింగి, అత్తాపూర్, మైలారదేవుపల్లి తదితర ప్రాంతాలలో శుక్రవారం వరలక్ష్మి పూజలు, వ్రతాలు భక్తులు ఎంతో వైభోవంగా జరుపుకున్నారు. ప్రభాత ఉదయం నుంచే ఆలయాలకు భారులు తీరారు. ఉదయం నుంచే నియోజకవర్గం పరిధి లోని ఆలయాలన్నీ భక్తులతో కిట కిటలాడాయి. మరో వైపు ముత్తాయిదు మహిళలు తమ తమ ఇళ్లలో పూజలతో పాటు వ్రతాలు నిర్వహించారు. కాలనీలు, బస్తిలలో పూర్తిగా పండుగ వాతావరణం నెలకొని సందడిగా మారింది.



కోట్ల చంద్రకాంత్ తో సౌభాగ్య ఆశీర్వాదం తీసుకుంటున్న మౌనిక.





వాయనం తీసుకుంటున్న సంధ్య, మౌనిక

**సౌభాగ్యం కోసం... వాయనం.**

వరలక్ష్మి పూజలు, వ్రతాలు చేసిన తరువాత ముత్తాయిధులకు ( వివాహితలకూ) పసుపు, కుంకుమ, తాంబూలం, ప్రసాదములు ఇచ్చి ఆశీర్వాదం పొందదాన్ని వాయనం అంటారు. ముత్తాయిదులు తమ సౌభాగ్యం నిండు నూరేళ్లు ఉండేలా ఈ వాయనం పూజలు ప్రత్యేకంగా చేస్తారు. ప్రధానంగా ఈ వాయనం ఇవ్వడం వలన శ్రావణ శుక్రవారం రోజున అమ్మవారి అనుగ్రహం కలిగి లక్ష్మి కటాక్షం తో తమ తమ కుటుంబాలు ఐశ్వర్యం, ఆరోగ్యం ఉ ంటారని భక్తుల ప్రగాఢ నమ్మకం.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. “RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608